క్లుప్తంగా

పన్ను చెల్లించలేదని తాళం



తాళం వేస్తున్న కార్పొరేషన్ అధికారులు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని ఇక్బాల్ అహ్మద్‌నగర్‌లో పండ్ల గోదాం నిర్వహిస్తున్న సుదర్శన్ అనే వ్యక్తి ఆస్తి పన్ను చెల్లింపులో జాప్యం చేస్తుండడంతో, కార్పొరేషన్ అధికారులు గోదాంకు సోమవారం తాళం వేశారు. 2018నుంచి ఆస్తి పన్ను చెల్లింపునకు విముఖత చూపిస్తుండగా, మొత్తం రూ.77,426 చెల్లించాలని అధికారులు రెడ్‌నోటీసులు ఇచ్చినా స్పందించలేదు. దీంతో గోదాముకు తాళం వేసినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేషన్ మేనేజర్ విజయ్ కుమార్, రెవెన్యూ ఆఫీసర్ శ్రీనివాస రెడ్డి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీ నరసింహస్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మందమర్రిరూరల్: పట్టణంలోని రెండో జోన్ రైల్వేస్టేషన్ రోడ్డులోని వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయ ప్రాంగణంలో తొమ్మిదో వార్షికోత్సవం సందర్భంగా లక్ష్మీ నరసింహస్వామి కల్యాణం కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. కాయితాల చంద్రమౌళి, నూతి తిరుపతి, రమణాచారి దంపతులు కల్యాణంలో పాల్గొన్నారు.

లక్ష్మీ అమ్మవారికి బోనాలు



గ్రామదేవతకు పూజలు చేస్తున్న యువకులు

భీమారం: మండల కేంద్రంలో ముదిరాజ్ కులస్తులు నిర్మించిన లక్ష్మీ అమ్మవారి దేవాలయంలో సోమవారం బోనాల పండుగను భక్తులు ఘనంగా నిర్వహించారు. బోనాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. ముదిరాజ్ కుటుంబాలతో పాటు గ్రామస్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

గూడెం ఆలయ హుండీ ఆదాయం లెక్కింపు



హుండీ డబ్బులు లెక్కిస్తున్న సిబ్బంది

దండేపల్లి: మండలంలోని గూడెం సత్యనారాయణస్వామి ఆలయ హుండీ ఆదాయాన్ని సోమవారం లెక్కించినట్లు ఆలయ ఈవో శ్రీనివాస్ తెలిపారు. 88 రోజుల్లో హుండీ ద్వారా రూ.7,15,865 ఆదాయం సమకూరిందని పేర్కొన్నారు. దేవాదాయ సహాయ కమిషనరు నవీన్ పర్యవేక్షణలో చేపట్టిన ఈ లెక్కింపులో వేదపారాయణదారు భరత్‌శర్మ, అర్చకులు సంపత్‌శర్మ, రామకృష్ణ, సురేష్, సత్యనారాయణ సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లి ఆలయ నూతన కమిటీ ఎన్నిక



మంచిర్యాలటౌన్: మంచిర్యాల పట్టణంలోని హమాలీవాడ పెద్దమ్మ తల్లి ఆలయ నూతన కమిటీని పట్టణ అధ్యక్షుడు శాతం మల్లేశ్ ఆధ్వర్యంలో సోమవారం ఎన్నుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడిగా ఆనవేన సూరయ్య, ఉపాధ్యక్షులుగా గుజ్జేటి తిరుపతి, పల్లె సారయ్య, ప్రధాన కార్యదర్శిగా జక్కుల రాజు, కోశాధికారి చొప్పరి సారంగపాణి, కార్యనిర్వహణ కార్యదర్శి తడవేని మల్లేశ్, కార్యదర్శులుగా గంగాదరి అంజయ్య, పిట్టల జయన్న, భాదరవేని రాజం, పిట్టల ఓదెలు, కార్యవర్గ సభ్యులుగా పిట్టల రాయలింగు, సంధనవేని ప్రవీణ్, కనుకుంట్ల శ్రీనివాస్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ మడిగెల సురేశ్, పట్టణ యూత్ అధ్యక్షుడు వనం రాజశేఖర్, 18 వ వార్డు అధ్యక్షుడు భూతగడ్డ చిన్నయ్య, మామిడి శ్రీనివాస్, పిట్టల రవీందర్ పాల్గొన్నారు.

పత్తి కొనుగోళ్లు బంద్

చెన్నూర్: చెన్నూర్ వ్యవసాయ మార్కెట్ పరిధిలో గల జిన్నింగ్ మిల్లులలో మంగళవారం నుంచి సీసీఐ పత్తి కొనుగోళ్లు నిలిపివేస్తున్నట్లు చెన్నూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి షాహబుద్దీన్ తెలిపారు. రైతులు జిన్నింగ్ మిల్లులకు పత్తిని తీసుకురావద్దని పేర్కొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా



జైపూర్: మండల కేంద్రంలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం వీడ్కోలు సమావేశం ఉల్లాసంగా.. ఉత్సాహంగా సాగింది. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేసి ఇటీవల రిటైర్డ్ అయిన అలీస్‌మాధుర్యను ఉపాధ్యాయులు, విద్యార్థులు సన్మానించారు. పాఠశాల హెచ్‌ఎంఎస్ శ్యామ్‌సుందర్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ సునీతారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వీడ్కోలు వేడుక



భీమిని: కన్నెపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు తొమ్మిదో తరగతి విద్యార్థులు సోమవారం వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కజ్జం రమేష్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఫేర్‌వెల్ హంగామా



చెన్నూర్‌రూరల్: మండలంలోని పొక్కూరు గ్రామంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో సోమవారం ఫేర్‌వెల్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పదో తరగతి విద్యార్థులకు పాఠశాల హెచ్‌ఎం దత్తకుమార్ పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, పెన్సిళ్లను అందజేశారు. అనంతరం పలు సినీ, జానపద గీతాలకు విద్యార్థులు చేసిన నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.

సమస్యల పరిష్కారానికే 'ప్రజావాణి'

- అంతంత మాత్రంగానే వినియోగించుకుంటున్న ప్రజలు
- పలుచోట్ల స్పందన కరువు
- వచ్చిన చోట భూ వివాదాల ఫిర్యాదులే అధికం

సమస్యల పరిష్కారానికే ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రజలు హాజరై తమ సమస్యలను విన్నవించుకోవాలని, పరిశీలించి వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి స్పందన కరువయ్యింది. అంతంత మాత్రంగానే ఫిర్యాదులు వచ్చాయి. వీటిలో ఎక్కువ శాతం భూ సమస్యలకు సంబంధించినవి కావడం గమనార్హం.



తాండూర్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్

చెన్నూర్‌రూరల్: చెన్నూర్‌లో ప్రజావాణికి స్పందన కరువయ్యింది. ఒక్క ఫిర్యాదు కూడా రాలేదు. ఎంపీడీవో మోహన్, ఐకేపీ ఏపీఎం ప్రమీల, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జైపూర్: మండల కేంద్రంలో ఎమ్మార్వో వనజారెడ్డి, శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్, ఎస్సై శ్రీధర్, ఎంపీడీవో సత్యనారాయణ, ఎంపీవో శ్రీపతిబాపురావు, వ్యవసాయశాఖ ఏవో మార్క్‌గ్లాస్టన్, ఐకేపీ ఎంపీఎం రాజ్‌కుమార్, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు. ఒక్క ఫిర్యాదు కూడా అందలేదు.

నెన్నెల: మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణికి ఎలాంటి ఫిర్యాదులు రాలేదు. తహసీల్దార్ రమేశ్, ఎంపీడీవో దేవేందర్, ఎస్సై ప్రసాద్, ఎంపీవో శ్రీనివాస్, ఏపీవో నరేష్ పాల్గొన్నారు.

చెన్నూర్: చెన్నూర్ తహసీల్ కార్యాలయంలో రెవెన్యూ కమిటీ ఆధ్వర్యంలో ప్రజావాణి నిర్వహించినట్లు తహసీల్దార్ మల్లికార్జున్ తెలిపారు. దరఖాస్తులు రాలేదు. రెవెన్యూ కమిటీ అధికారులు ఎస్సై వెంకటేశ్వర్‌రావు, మున్సిపల్ కమిషనర్ మురళికృష్ణ పాల్గొన్నారు.

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్‌లో నిర్వహించిన ప్రజావాణిలో నలుగురు అర్జీదారుల నుంచి భూ సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ప్రతీ సోమవారం ఉదయం 10–30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు భూ వివాదాల పరిష్కారానికి అర్జీలు స్వీకరిస్తున్నట్లు తహసీల్దార్ శ్రీనివాస్‌రావు దేశ్‌పాండే తెలిపారు. ఎస్సై గోపతి సురేశ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

భీమారం: తన మూడెకరాల భూమి తనకు తెలియకుండానే వేరే వారికి అక్రమంగా పట్టా అయిందని, రద్దు చేయాలని ప్రజావాణిలో దాంపూర్ గ్రామానికి చెందిన కందుగుల తిరుపతి తహసీల్దార్ సదానందంకు ఫిర్యాదు చేశారు. విచారణ జరిపి న్యాయం చేస్తానని తహసీల్దార్ హామీ ఇచ్చారు. ఎస్సై శ్వేత, ఎంపీవో సతీష్ రెడ్డి లతో పాటు పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

లక్సెట్టిపేట: మండల కేంద్రంలో భూములకు సంబంధించి మూడు అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ దిలీప్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మారుతిప్రసాద్, ఎస్సై సతీష్, ఎంపీడీవో సరోజ, ఐకేపీ ఏపీఎం లక్ష్మి, ఎంపీవో శ్రీనివాస్ అధికారులు పాల్గొన్నారు.

నస్పూర్: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో భూ వివాదాలకు సంబంధించిన మూడు దరఖాస్తులు వచ్చాయి. కార్యక్రమంలో సీసీసీ నస్పూర్ ఎస్సై నెల్కి సుగుణాకర్, శ్రీరాంపూర్ ఎస్సై మేకల సంతోష్, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేనేజర్ కరుణాకర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తాండూర్: తహసీల్దార్ కార్యాలయంలో భూ సమస్యల పరిష్కారం కోసం 12అర్జీలు వచ్చాయి. తహసీల్దార్ ఇమ్రాన్ ఖాన్, ఎంపీడీవో శ్రీనివాస్, ఎస్సై కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాసిపేట: మండల కేంద్రంలో భూ సమస్యలపై మూడు దరఖాస్తులు వచ్చాయి. కార్యక్రమంలో తహసీల్దార్ భోజన్న, ఎంపీడీవో సత్యనారాయణసింగ్, ఎంపీవో షేక్ సబ్దర్ అలీ, కాసిపేట, దేవాపూర్ ఎస్సైలు ప్రవీణ్‌కుమార్, ఆంజనేయులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధిక, ఏఈవో రమ్య తదితరులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో భూ సంబంధమైన నాలుగు దరఖాస్తులు వచ్చాయి. కార్యక్రమంలో తహసీల్దార్ యు.జ్యోత్స్న, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, ఎస్సైలు రమేష్, మహేందర్, ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వేమనపల్లి: మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఎస్సై శ్యాంపటేల్, ఆర్ఐ ఖలీక్ పాల్గొన్నారు. మిగితా శాఖల అధికారులు ఎవరూ పాల్గొనలేదు. ఎలాంటి అర్జీలు రాలేదు.

భీమిని: కన్నెపల్లిలో రెండు, భీమినిలో రెండు దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్లు శ్రవణ్‌కుమార్, బికార్ణదాస్ తెలిపారు. ఎంపీడీవో శంకర్, ఎస్సైలు గంగారాం, విజయ్‌కుమార్, ఐకేపీ, ఐసీడీఎస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్పందించి.. పరిశీలించి



మందమర్రిరూరల్: మండలంలోని వెంకటాపూర్ ఎమ్మెల్యే కాలనీలో ఇటీవల నిర్మించిన కాలువ నాణ్యత లోపించి పగుళ్లు తేలింది. ఈ విషయమై శనివారం 'సాక్షి'లో 'నాణ్యత గాలికి' అనే శీర్షికన కథనం ప్రచురితం కాగా అధికారులు స్పందించారు. ఎంపీడీవో రాజేశ్వర్, ఆర్‌డబ్ల్యూఎస్ అండ్ ఎస్ విభాగం ఏఈఈ మనోజ్ సోమవారం కాలువ పగుళ్లను పరిశీలించారు. కాలువలోని పగుళ్లు తేలిన బెడ్‌ను తీయించి నాణ్యతా ప్రమాణాలు పాటించి కాలువను సరిచేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు.

స్పీడ్ బ్రేకర్ల తొలగింపు



సాక్షి ఎఫెక్ట్..

శ్రీరాంపూర్: 'రోడ్లకు మహర్దశ' అనే శీర్షికన 'సాక్షి'లో సోమవారం వచ్చిన కథనంపై సింగరేణి సివిల్ అధికారులు స్పందించారు. ప్రధాన రోడ్లపై నూతనంగా తార్ వేస్తున్న సందర్భంలో శాస్త్రీయ దృక్పథం లేకుండా ఎక్కడ పడితే అక్కడ స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారని కథనంలో వివరించగా, సివిల్ ఉన్నత అధికారులు స్పందించారు. అనవసరం అనుకున్న చోట ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్లను సోమవారం తొలగించారు.

చెరువులు కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

కోటపల్లి: తెలంగాణ మత్స్యకారుల మత్స్యకార్మిక సంఘం ఆధ్వర్యంలో శెట్‌పల్లి మత్స్యకారుల సమస్యలపై సోమవారం కలెక్టర్ కుమార్‌దీపక్‌కు వినతిపత్రం అందజేశారు. శెట్‌పల్లి చెరువు కబ్జాకు గురికావడంతో చేపల పెంపకంపై ఆధారపడి నివసిస్తున్న 30కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి నెలకొందన్నారు. గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు చెరువులోని నీటిని పైపులు, మోటారుతో నీటిని తీయడం వల్ల చెరువు పూర్తిగా ఎండిపోయి, చేపలు చనిపోతున్నాయని వాపోయారు. దీంతో మత్స్యకారులకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. ఈ విషయంపై నీటిపారుదల శాఖ అధికారుల దృష్టికి తీసువెళ్లడంతో సదరు వ్యక్తులకు నోటీసులు ఇచ్చినా, లెక్కచెయకుండా చెరువు నీళ్లను తోడుకపోతున్నారన్నారు. ఉన్నతధికారులు స్పందించి మత్స్యకారుల కుటుంబాలు రోడ్డున పడకుండా న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా కార్యదర్శి బొడంకి చందు, మేడి శ్రీనివాస్, సురేశ్, మహేశ్ పాల్గొన్నారు.



కలెక్టర్ కుమార్‌దీపక్‌కు వినతిపత్రం ఇస్తున్న మత్స్యకారులు

వసతిగృహాల్లో సమస్యలపై అధికారుల ఆరా

కోటపల్లి: మండలంలోని ఎస్సీ బాలుర హాస్టల్, కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల, గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను సోమవారం తహసీల్దార్ రాఘవేంద్రరావు, ఎంపీడీవో లక్ష్మయ్య, ఎస్సై రాజేందర్ సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడారు. వసతిగృహాల్లో సమస్యలపై ఆరా తీశారు. హాస్టల్‌లో మెనూ తప్పక పాటించాలని, విద్యార్థులకు అందుబాటులో ఉండి ఆరోగ్య పరిస్థితులను గమనించాని సిబ్బందికి ఆదేశించారు. పదో తరగతిలో బాగా చదివి వందశాతం ఉత్తీర్ణత సాధించాలని విద్యార్థులకు సూచించారు. ఎస్సీ హాస్టల్‌లో నెలకొన్న సమస్యలపై కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని తహసీల్దార్ తెలిపారు. కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల, ఆశ్రమ పాఠశాలలో మహిళ కానిస్టేబుల్‌ను ఇన్‌ఛార్జీగా నియమించనున్నట్లు ఎస్సై రాజేందర్ తెలిపారు. కార్యక్రమంలో డీటీ నవీన్‌కుమార్, కార్యదర్శి సందీప్ పాల్గొన్నారు.



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న అధికారులు

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: కొంత కాలంగా ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ సీఐటీయూ అనుబంధ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీలు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏళ్ల తరబడి మా సమస్యలు పరిష్కరించకుండా వెట్టిచాకిరి చేయించుకుంటుందని వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నాలో అంగన్‌వాడీలు

అంగన్‌వాడీల పై వివక్షత వీడాలి

చెన్నూర్: గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో విధులు నిర్వర్తిస్తున్న అంగన్‌వాడీ టీచర్లపై అధికారులు వివక్షత చూపుతున్నారని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఖలీందర్ అలీఖాన్ అన్నారు. స్థానిక తాపీమేస్త్రీ సంఘ భవనంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అంగన్‌వాడీల సమస్యలపై అధికారులు స్పందించడం లేదన్నారు. ప్రశ్నించిన వారిని ఒత్తిళ్లకు గురి చేస్తున్నారని ఆరోపించారు. సమస్యల పరిష్కారంపై అధికారులు దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు పౌల్, మండల కార్యదర్శి సమ్మయ్య, పట్టణ కార్యదర్శి సుంకరి చందు, నాయకులు, అంగన్‌వాడీ టీచర్స్ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు తీర్చాలి

మంచిర్యాలటౌన్: తెలంగాణ మున్సిపల్ కాంట్రాక్టు కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం మంచిర్యాల కార్పొరేషన్ కమిషనర్ శివాజీకి కార్మికుల సమస్యలను తీర్చాలని కోరుతూ వినతిపత్రం అందించారు. కార్మికుల పీఎఫ్ డబ్బులు కటింగ్ అయి, వారి అకౌంట్లో జమ కాని డబ్బులను వెంటనే జమ చేసేలా చూడాలన్నారు. సాయికిరణ్ అనే వ్యక్తిని కార్పొరేషన్‌కు సంబంధం లేకుండా నియమించి, పారిశుధ్య కార్మికుడిగా పేర్కొని, కమిషనర్ కారు డ్రైవర్‌గా పనిచేయిస్తున్నారని, వెంటనే అతన్ని పారిశుధ్య కార్మికునిగా పనిచేయించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు దేవి సత్యం, నాయకులు కోకిల శ్రీనివాస్, ఆవునూరి గోపాల్, సత్తయ్య, శ్రీనివాస్, మాడుగుల నవీన్, రాజం, రవి, చొప్పదండి రాయలింగు, సుమన్, విష్ణు, రామస్వామి, దుర్గయ్య పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

23న సీపీఐ జనరల్ బాడీ సమావేశం

బెల్లంపల్లి: బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ సీపీఐ జనరల్‌బాడీ సమావేశాన్ని ఈ నెల 23న నిర్వహిస్తున్నట్లు సీపీఐ పట్టణ కార్యదర్శి ఆడేపు రాజమౌళి, ఏఐటీయూసీ జిల్లా సీనియర్ నాయకుడు చిప్ప నర్సయ్య తెలిపారు. పట్టణ సీపీఐ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో కరపత్రాలు ఆవిష్కరించారు. ఉదయం 10గంటలకు గంగారాం విజ్ఞాన్ భవన్‌లో సమావేశం నిర్వహిస్తున్నట్లు, కార్యకర్తలు సకాలంలో హాజరు కావాలని కోరారు.

మెడికల్ కాలేజీకి క్రీడాసామగ్రి అందజేత

మంచిర్యాలటౌన్: మంచిర్యాల ప్రభుత్వ మెడికల్ కాలేజీలో రెండో వార్షికోత్సవ వేడుకలను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పలు క్రీడాపోటీలను నిర్వహించగా, అందుకు అవసరమైన క్రీడా సామగ్రిని లయన్స్ క్లబ్ మంచిర్యాల సభ్యులు కళాశాలకు అందించారు.

పోలీస్ విధులపై అవగాహన

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని అల్ఫోర్స్ స్కూల్ విద్యార్థులకు పోలీస్ విధులపై సోమవారం స్థానిక సీఐ ప్రమోద్‌రావు అవగాహన కల్పించారు. నేరరహిత సమాజం కోసం పోలీసులు చేస్తున్న కృషి, తదితర అంశాలపై వివరించారు.

బోనస్ డబ్బులు ఇప్పించాలని వినతి

దండేపల్లి: ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో సన్నరకం ధాన్యం విక్రయించిన రైతులకు క్వింటాళ్‌కు రూ.500 చొప్పున ప్రభుత్వం అందించే బోనస్ ఇప్పించాలని దండేపల్లి మండలం కన్నెపల్లి గ్రామ రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు అఖిలపక్ష రైతు సమితీ ఆధ్వర్యంలో దండేపల్లి తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం డిప్యూటీ తహసీల్దార్ విజయకు వినతిపత్రం అందించారు.

21, 22 తేదీల్లో ఇంటర్వ్యూలు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల ప్రభుత్వ మెడికల్ కాలేజీలో క్యాజువాలిటీ మెడికల్ అధికారి పోస్టులను ఒప్పంద పద్ధతిన భర్తీ చేసేందుకు ఈ నెల 21, 22 తేదీల్లో వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎండి సులేమాన్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ వైద్య శాలలోని క్యాజువాలిటీ విభాగంలో 5 క్యాజువాలిటీ మెడికల్ ఆఫీసర్ పోస్టులలో సీఎంవో/ఆర్ఎంవోగా విధులను నిర్వహించేందుకు ఎంబీబీఎస్ విద్యార్హత కలిగిన వారికి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఇంటర్వ్యూలు ఉంటాయని, ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

టీజీడబ్ల్యూడబ్ల్యూసీ జిల్లా కార్యవర్గం

జన్నారం: మంచిర్యాల జిల్లా తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి (టీజీ డబ్ల్యూడబ్ల్యూసీ) నూతన కమిటీని ఏకగ్రీవంగా నియమించినట్లు వ్యవస్థాపక అధ్యక్షుడు కల్లెడ భూమయ్య తెలిపారు. జిల్లా అధ్యక్షుడిగా ఎరుకల రమేష్ గౌడ్ ను నియమించినట్లు తెలిపారు.

బాధ్యతలు స్వీకరణ

చెన్నూర్: పట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా దేవేందర్ రావు సోమవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలని ఆయన కోరారు.

బీసీ వెల్ఫేర్ లైజన్ అధికారిగా మధు కుమార్

బెల్లంపల్లి: బెల్లంపల్లి ఏరియా బీసీ వెల్ఫేర్ లైజన్ అధికారిగా సింగరేణి ఏరియా ఆసుపత్రి డీవైసీఎంవో మధుకుమార్ నియామకమయ్యారు. సోమవారం ఏరియా ఆసుపత్రిలోని ఆయన ఛాంబర్‌లో మధుకుమార్‌కు బీసీ సంఘం నాయకులు ఘనంగా సన్మానం చేశారు.

సమస్యలు పరిష్కరించాలని ధర్నా

బెల్లంపల్లి: అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం బెల్లంపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆశావర్కర్లు ధర్నా చేశారు. తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు సామూహికంగా తరలివచ్చి ధర్నాలో పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌వీ శ్రేణులపై ఫిర్యాదు

తాండూర్: సీఎం రేవంత్‌రెడ్డి ఫొటోలను మార్ఫింగ్ చేసి, సోషల్‌మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్‌వీ శ్రేణులపై సోమవారం ఎన్‌ఎస్‌యూఐ నాయకులు మాదారం పోలీసుస్టేషన్‌లో ఎస్సై సౌజన్య ఫిర్యాదు చేశారు. వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

బొగ్గుబాయి వార్తలు

'బయటి వారిని తీసుకోవద్దు'

శ్రీరాంపూర్: సింగరేణి కీలకమైన పోస్టుల్లో బయటి వారిని తీసుకోవద్దని తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం బెల్లంపల్లి రీజియన్ అధ్యక్షుడు సమ్ము రాజయ్య యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఆర్కే 6 గనిపై సోమవారం ఆయన కార్మికులను కలిసి మాట్లాడారు. సింగరేణిలో చీఫ్ మెడికల్ ఆఫీసర్, చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ పోస్టులను సంస్థలోని సీనియర్ అధికారులను కాకుండా కాంట్రాక్టు పద్ధతిలో నియమించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. యాజమాన్యం తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జైపాల్ సింగ్, నాయకులు సారయ్య, చంద్రయ్య, శ్రీహరి, కనకయ్య, ఫయాజ్ పాల్గొన్నారు.

ఓసీపీ సందర్శన

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గనిలో కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని హెచ్ఎంఎస్ నాయకులు యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఆ యూనియన్ కేంద్ర కమిటీ నాయకులు తిప్పారపు సారయ్య, బ్రాంచ్ ఉపాధ్యక్షుడు అనిల్ రెడ్డి సోమవారం గనిని సందర్శించి కార్మికుల సమస్యలను తెలుసుకున్నారు. బంకర్ వద్ద దుమ్ము విపరీతంగా వస్తుందని, వాటర్ స్ప్రే చేయాల్సిన పరికరాలు పనిచేయడం లేదన్నారు. జీఎల్ బంకర్ వద్ద రెస్ట్‌హాల్, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్డి నిర్మాణం చేపట్టాలన్నారు. బ్రేక్ టైంలో కూడా కార్మికులు పనిచేస్తే వారికి ఓటీ చెల్లించాలన్నారు. నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాల సాధనకు అందరికీ ఇన్సెంటివ్ వర్తింపజేయాలన్నారు. కార్యక్రమంలో ఆ యూనియన్ ఫిట్ సెక్రెటరీ నామాల శ్రీనివాస్, నాయకులు నోముల బాలయ్య, దుర్గం లక్ష్మణ్ పాల్గొన్నారు.

నేడు వారసంత వేలం

తాండూర్: మండలంలోని రేచినీలో నిర్వహిస్తున్న వారసంతకు మంగళవారం వేలం నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటలకు వేలం ఉంటుందని, ఆసక్తి గల వారు ఉదయం 10–30గంటలకు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు.